

ఇరిగేషన్ సిఇగా శ్రీరామచంద్రమూర్తి

- మదనపల్లి ఇఇగా జి.శేషబాబు నియామకం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్గా పి.శ్రీరామచంద్రమూర్తి నియమితులయ్యారు. ప్రభుత్వం గురు వారం రాష్ట్రంలోని 10 మంది సీనియర్ ఇంజినీర్లను బదిలీ చేసింది. నలుగురు ఇఇలు, ఐదుగురు ఎస్ఇలు, సిఇలుగా నియమితులయ్యారు. శ్రీశైలం డ్యామ్ ఈస్ట్ విభాగం మెయింటెనెన్స్ సూపరింటెండెంట్ ఇంజినీర్గా విధులు నిర్వహిస్తున్న పి.రామచంద్రమూర్తిని ప్రమోషన్ కల్పిస్తూ కడప ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్గా బదిలీ చేసింది. ఇందుతోపాటు మదనపల్లి ఇన్చార్జ్, తంబళ్లపల్లి ఇరిగేషన్ డివిజన్ డిఇఇ శేషబాబుకు మదనపల్లి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్గా ప్రమోషన్ లభించింది.

అకాలం.. అందని పరిహారం

- 8,486 ఎకరాల్లో పంటలకు నష్టం
- రూ.11.20 కోట్ల పరిహారానికి నిరీక్షణ
- 8 నెలలుగా అందని విపత్తు సహాయ నిధి
- ఏడాది పాలనలో కూటమి అడుగులు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

'అందని ద్రాక్ష పుల్లన' అనే సామెత అకాల వర్షాల బారినపడి నష్టపోయిన రైతులకు అనుభవంలోకి వస్తోంది. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి జూన్ 12 నాటికి ఏడాది గడిచింది. ప్రకృతి వైపరీత్యాల బారిన పడిన రైతులకు మాత్రం పరిహారం అందని దుస్థితి దాపురించింది. 2025-26 ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో సాగు ఖర్చులకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో బాధిత రైతులు కళ్లుకాయలు కాసేలా ఎదురు చూడాల్సి వస్తోంది. వైసిపి హయాంలో ప్రకృతి విపత్తుల బారిన పడిన దెబ్బతిన్న రైతులకు మరో సీజన్ సాగు సమయానికి చెల్లింపులు చేయడంతో పోల్చుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. తమది రైతు ప్రభుత్వమని ప్రచారం చేసుకుంటున్నా రైతులను నిర్లక్ష్యం చేయడం ఏమిటని చర్చ నడుస్తోంది. గతేడాది అక్టోబర్, డిసెంబర్, ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో అకాలవర్షాలు అల్లకల్లోలం సృష్టించాయి. అకాల వర్షాల బారినపడి ఉద్యాన, వ్యవసాయ పంటలు పెద్ద ఎత్తున నష్టపోయాయి. 33 శాతం నిబంధన పేరుతో వేలాది ఎకరాలు పరిహారానికి ఆమడదూరంలో నిలిచిపోవడంతో వేలాది మంది రైతులకు పరిహారానికి అర్హత లభించని పరిస్థితి నెలకొంది.

అకాల నష్టాల పరిహారమేదీ!

కడప, అన్నమయ్య జిల్లాల్లో 2024 అక్టోబర్, డిసెంబర్, ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో కురిసిన అకాల వర్షాలకు 8,486 ఎకరాల్లో ఉద్యాన, వ్యవసాయ పంటలు నష్టపోయాయి. 3,078 మంది రైతులకు చెందిన 5,152 ఎకరాల్లో వరి, మినుము, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. 2024 అక్టోబర్లో కురిసిన అకాల వర్షాల బారిన పడిన 1,144 మంది రైతులకు సంబంధించిన 1,901 ఎకరాలకు 1.29 కోట్లు నష్టం వాట్లింది. డిసెంబర్లో 1,934 మంది రైతులకు చెందిన 3,250 ఎకరాల్లో 3.26 కోట్లు నష్టం వాటిల్లింది. వెరసి 4.55 కోట్లు నష్టం వాటిల్లింది. అన్నమయ్య జిల్లాలో డిసెంబర్లో నెలకొన్న ఫెంగల్ తుఫాన్ బారిన పడిన 2,339 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. సుమారు 1.76 కోట్ల మేరకు నష్టపోయిన సంగతి తెలిసిందే. రూ.6.31 కోట్లు నష్టం వాట్లిల్లింది. 2025-26 ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో గత పరిహారం చెల్లిస్తే సాగు ఖర్చులకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో ఎదురుచూపులు చూస్తున్న నేపథ్యం కనిపిస్తోంది.



పులివెందులలో దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న బిటెక్ రవి (ఫైల్)

ఉద్యాన పరిహారం తీరిలా..

కడప జిల్లాలో 3,334 ఎకరాల్లో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లా వ్యవసాయ, ఉద్యాన అధికారులు దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎన్యూమరేషన్ చేసిన అనం తరం సుమారు రూ.11.20 కోట్ల మేరకు పంట నష్టం వాటిల్లినట్లు ప్రతి పాదనలు అందజేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎనిమిది నెలలు గడిచి పోయినప్పటికీ అకాల వర్షాల బారిన పడిన రైతాంగా నికి నిరీక్షణ తప్పడం లేదు. ఇదేతరహాలో అన్నమయ్య జిల్లాలోని 55.75 ఎకరాల్లో అరటి, టమోటా, బీన్స్, చామంతి వంటి ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. తుఫాన్ వెలిసిన అనం తరం ఉద్యానసిబ్బంది ఎన్యూమరేషన్ చేసి రూ.22.30 లక్షల నష్టం వాటిల్లినట్లు నిర్ధారించి రాష్ట్రప్రభుత్వానికి నివేదించారు. అప్పటి నుంచి సుమారు ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ ఎటువంటి పరిహారం అందని దుస్థితి నెలకొనడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమ వుతోంది.

సీజన్లో పరిహారం చెల్లించాలి

గత రబీ సీజన్లో ప్రకృతి వైపరీత్యాల బారినపడి నష్టపోయిన రైతులకు ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో పరిహారం అందిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. కరువు మండలంగా ప్రకటించినప్పటికీ ఎటువంటి ఉపయోగమూ లేకుండా పోయింది.

- వీరారెడ్డి, రైతు, అయ్యవారిపల్లి, చాపాడు, కడప.

తక్షణమే ఆదుకోవాలి

గత సీజన్లో అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలి. ప్రభుత్వం సకాలంలో పరిహారం చెల్లిస్తే సాగు ఖర్చులకు ఉపయోగపడుతుంది.

- పద్మనాభం, రైతు, రాయచోటి, అన్నమయ్య.

సకాలంలో పరిహారం అందించాలి

ఫెంగల్ తుఫాన్, ఇతర అకాల వర్షాల బారిన పడిన బాధిత రైతులకు సకాలంలో పరిహా రాన్ని అందించాలి. రబీ సీజన్లో నష్టపోయిన రైతులను సత్వరమే ఆదుకోవాలి. ప్రస్తుత ఖరీఫ్ సీజ న్లోని సాగుదారులకు అందిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

- డి.దస్తగిరిరెడ్డి. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, కడప.

ప్రతిపాదనలు అందజేశాం

కడప, అన్నమయ్య జిల్లాల్లో అకాల వర్షాల బారిన పడిన రైతాంగానికి సంబంధించిన నష్టాల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి పరిహారం మంజూరైన వెంటనే పంపిణీ చేస్తాం

- బి.చంద్రనాయక్, వ్యవసాశాఖ జిల్లా అధికారి, కడప.

సంతృప్తికరంగా లేని ఏడాది పాలన

- జనానికి అప్పులు తప్ప ఆదాయం లేదు
- కార్పొరేట్లకు భూ పందేరం
- చంద్రబాబును ఆడిస్తున్న కేంద్రం
- నగర కమిటీ ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి పాలన ఏడాదిలో ఏ మాత్రమూ సంతృప్తికరంగా లేదని, సూపర్ సిక్స్ హామీలు అమలో విఫలం చెందిందని, జనానికి అప్పులు తప్ప ఆదాయం లేని పరిస్థితి ఏర్పడిందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం కడప అంబేద్కర్ సర్కిల్లో ఏడాది పాలనపై సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందనే ఉద్దేశంతో విసిగిపోయిన ప్రజలు 56 శాతం ఓట్లు కట్టబెట్టారని, ఆ నమ్మకాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోలేదని పేర్కొన్నారు. ప్రజల్లో నిరుత్సాహం, ఆందోళన, అసంతృప్తి పెరిగిపోయాయని చెప్పారు. ప్రజలకు ఆదాయం లేదని, అప్పులు మిగిలాయని వివరించారు. ఎన్నికల ముందు 178 వాగ్దానాలు ఇచ్చి ఏడాదిలో 16 వాగ్దానాలను అమలు చేశారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చేయగలిగే సత్తా ఉన్నా ప్రస్తుత డైరెక్షన్ తప్పుడు మార్గంలో నడుస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బసు ప్రయాణం, అన్నదాత సుఖీభవ అమలు నిరుద్యోగ భృతి, ప్రతి మహిళకు నెలకు రూ.1500, మెగా డిఎస్సి నోటిఫికేషన్, ఇచ్చిన హామీలను గాల్లో కలిసిపోయాయని తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఏడాది పట్టిందని, కార్పొరేట్లకు సేవ చేయడంలో మాత్రం ఆలస్యం జరగడం లేదని తెలిపారు. కార్పొరేట్లకు ఇచ్చిన భూముల్లో కార్యకలాపాలు లేకపోతే ఐదేళ్లలో వెనక్కు తీసుకోవాలన్నారు. కార్పొరేట్లకు భూ పందేరం చేయడంలో ఉన్న శ్రద్ధ వేగం, పేదలకు ఇళ్లు ఇవ్వడంలో లేదని పేర్కొన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వ సూచనల మేరకు ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేశారని చెప్పారు. వైసిపి ప్రభుత్వంలో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలు వినాశకరమని టిడిపి నాయకులు ప్రతిపక్షంలో ఉండగా కోర్టులో కేసులు వేసిన టిడిపి నాయకులు ఇప్పుడు నోరెత్తడం లేదన్నారు. రూ.1780 కోట్లు లంచాలు ఇచ్చారని కేసులు నమోదైన అదానీతోనే ఈ ప్రభుత్వం లావాదేవీలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. మహిళలపై వారానికి నాలుగు అత్యాచారాలు జరుగుతున్నాయని వివరించారు. పాలనలో మార్పులు కోరుకున్న టిడిపి నాయకులే రెండిటికీ తేడా లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు కేంద్రంలో ఏ ప్రభుత్వానైనా ఆడించేవారని, ఇప్పుడు మోడీ చంద్రబాబును ఆడిస్తున్నారని అన్నారు. యోగా పేరుతో అధికారులను నెలరోజులుగా దానిచుట్టూ తిప్పుతున్నారని విమర్శించారు. ఇళ్లస్థలాల రెగ్యులరైజ్ చేయడం లేదని, జిఒ ఇచ్చినా అమలు కావడం లేదని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు పగులకొట్టాలని పిలుపునిచ్చిన టిడిపి అధికారంలోకి ఇళ్లకు బిగిస్తోందని తెలిపారు. ఏడాది కాలంలో గాడితప్పిన పాలనను సరిచేసుకుని నాలుగేళ్ల పాలనసాగించాలని సూచించారు. లేనిపక్షంలో హామీల అమలు, భారాలకు వ్యతిరేకరంగా ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి ఎ. రామ్మోహన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, కె.శ్రీనివాసులు రెడ్డి, నగర కమిటీ నాయకులు కుమార్ స్వామి రెడ్డి, చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, రఘు, మహిళా సంఘం నాయకురాలు సరిత, విద్యార్థి సంఘం నాయకులు వి.రవి, యువజన సంఘం నాయకులు ఉదయ్ కుమార్, విజయ్ పాల్గొన్నారు.



అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

అమలుకాని సూపర్సిక్స్ పథకాలు

ప్రొద్దుటూరు : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా ఇంతవరకు సూపర్సిక్స్ పథకాలు అమలు కాలేదని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం సూపర్సిక్స్ పథకాల హామీ అమలు కాలేదని నిరసనగా గురువారం సిపిఎం స్థానిక రాజీవ్ సర్కిల్లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరిగిన మహానాడులో ఈనెల 12లోపు స్టీల్ ప్లాంట్ పనులు మొదలు పెడతామని చెప్పారన్నారు. ఈ రోజు స్టీల్ప్లాంట్ గురించి పట్టించుకోకపోవడం జిల్లా ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. ఒంటరి మహిళలకు పెన్షన్లు ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. పట్టణాల్లో రెండు సెంట్లు పల్లె ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఇస్తామని చెప్పారన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ స్పందించాలని స్టీల్ప్లాంట్ వచ్చేవరకు ఎమ్మెల్యేలందరూ పట్టుబట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం సుందరయ్య నగర్ ఏరియా కార్యదర్శి శేఖర్, చెన్నారెడ్డి, బ్రహ్మంగారి శాఖ కార్యదర్శి శీను, నారాయణ, సుబ్బరాయుడు, మంజయ్య, మహిళా సంఘం నాయకురాలు రాములమ్మ, డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



స్మార్ట్మీటర్ వద్దంటూ స్టిక్కర్ అంటిస్తున్న సిపిఎం నాయకులు

స్మార్ట్ మీటర్లను బహిష్కరించండి

ప్రజాశక్తి-అట్లూరు

ప్రజలు స్మార్ట్మీటర్ల బిగింపును బహిష్కరించాలని సిపిఎం మండల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం సిపిఎం కార్యాలయంలో మీటర్లు బహిష్కరించాలని పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అంటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.చాంద్బాషా, అట్లూరు మండల పార్టీ కార్యదర్శి ఇ. రమణయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ కరెంట్ మీటర్లు బిగిస్తే ప్రజలందరూ వాటిని బహిష్కరించాలని చెప్పి నేడు ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాలు మోపుతున్నారని పేర్కొన్నారు. పైపగా స్మార్ట్ మీటర్లు బిగించేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంకో మాట మాట్లాడడం సిగ్గు చేటని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ను ఉచితంగా బిగించి తరువాత 90 నెలల వరకు మీటర్ ఖరీదు రేటు బిల్లులో వసూలు చేసేందుకు కుట్రపన్నుతున్నారని వాపోయారు. సెల్ రీఛార్జి మాదిరిగా కరెంట్కు కూడా రీఛార్జ్ చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంటుందని వాపోయారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తే సిపిఎం ఆధ్వర్యంలో మీటర్లను ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దుర్గమ్మ, స్వప్న ,సుబ్బమ్మ, రవిచంద్ర, గోపయ్య, అట్లూరుగోపయ్య, ఓబయ్య, నరసింహులు పాల్గొన్నారు.

రాజకీయాలు ఆపాదించవద్దు

ప్రజాశక్తి - కడప అర్బన్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రైతులు

నగరంలోని ఒకటో డివిజన్లో ఉన్న పాత కడప చెరువులో మట్టిని వ్యవసాయ పనుల కోసం తరలించుకుంటున్నట్లు రైతులు తెలిపారు. గురువారం పాత కడప చెరువు వద్ద రైతులు మీడియాతో మాట్లాడారు. రైతు పొలములో మట్టి అవసర నిమిత్తం పాత కడప చెరువు నుంచి తరలించుకుంటున్నామని పేర్కొన్నారు. రైతు అవసరాలను కూడా రాజకీయం చేయడం భావ్యం కాదని పేర్కొన్నారు. ఐదేళ్ల నుంచి పొలాలకు మట్టి లేక పంటలు సరిగా పడడం లేదని పేర్కొన్నారు. చెరువులో ఉన్న ఒండ్రు మట్టి వేయడం వల్ల మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మట్టి తరలింపుకు అవసరమైన ప్రభుత్వ జీవో కూడా తమ వద్ద ఉందని చెప్పారు. పాత కడప చెరువులో వినాయక నిమజ్జనాల కారణంగా పూడిక పేరుకుపోతుందని తెలిపారు. సామర్థ్యాని కంటే తక్కువ నీటి స్టోరేజ్ ఉండడం వల్ల వ్యవసాయ అవసరాలకు నీరు సరిపోవడం లేదని చెప్పారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నిబంధనలకు లోబడే మట్టిని రైతులు తోలుకుంటూ ఉన్నారని తెలిపారు. తమకు రాజకీయాలు వద్దని, తగిన సామర్థ్యంతో నీటి స్టోరేజీ కావాలని కోరారు. పొలాల్లో పురుగు మందులు ఎక్కువై భూమి సారాన్ని కోల్పోతుందని, ఒండ్రు మట్టి వేయడం ద్వారా తిరిగి సారవంతమవుతుందని పేర్కొన్నారు. నీరు ఎక్కువగా నిలవడం ద్వారా రెండు కార్ల పంటలు పండే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వ రైతులు మట్టి తోలుకునే అవకాశం కల్పించాలని కోరారు. చెరువులోకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దాదాపు 4 అడుగుల వరకు మట్టిని తరలించేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో రైతులు నిమ్మకాయల నారాయణరెడ్డి, డి.నాగేశ్వరరెడ్డి, కె.రవిశంకర్ రెడ్డి, పి.రమణారెడ్డి, కె. రమణారెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, ఎస్.విశ్వనాధ రెడ్డి, రత్నాకర్ రెడ్డి, కే సురేష్, మద్దిక వివేకానంద రెడ్డి, బి. నాగేశ్వరరావు, మురికినాటి శ్రీధర్, డైరెక్టర్లు పట్టాభి రెడ్డి, పి.రవి కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వై.ఎస్. షర్మిల

ఏడాది పాలనలో ప్రజలకు అరచేతిలో వైకుంఠం

- బిజెపి చేసిన మోసానికి మద్దతు విరమించుకోవాలి

- పిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిల

ప్రజాశక్తి - కడప

ఎన్నికల ప్రచార పత్రంలా చంద్రబాబు ఏడాది విజయపత్రం ఉందని, ఏడాది పాలనలో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించాలని పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిల విమర్శించారు. సూపర్ సిక్స్కు దిక్కు లేకుండా పోయిందని వాపోయారు. రాష్ట్రానికి బిజెపి చేసిన మోసానికి మద్దతు తక్షణం విరమించుకోవాలని కాంగ్రెస్ పార్టీగా తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి వచ్చిన ఆమె గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు పాలనకు ఏడాది పూర్తయిందని, ఈ ఏడాదిలో సాధించినది గొప్పలు చెప్పడమే అన్నారు. ఏదో ఉద్ధరించినట్లు విజయ పత్రం ఇచ్చారు, విజయపత్రంలో చేయాల్సినవి చెప్పారు, ఇచ్చింది ఎంత? సాధించింది ఎంత?, ఏడాది గడిచినా సూపర్ సిక్స్కు దిక్కు లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇప్పటివరకు దిక్కే లేదన్నారు. ఉచిత ప్రయాణంపై పండుగలు పేరు చెప్పి కాలయాపన చేశారని విమర్శించారు. నిరుద్యోగ భృతి లేదు, 20 లక్షల ఉద్యోగాలు దిక్కు లేదని విమర్శించారు. రైతులను ఆదుకున్న పరిస్థితి లేదన్నారు. ఇచ్చిన హామీలు ఇష్టం వచ్చినప్పుడు అమలు చేయడం కాదు అని అన్నారు. గడిచిన ఏడాదిగా సూపర్ సిక్స్ పథకాలు మరిచారని ధ్వజమెత్తారు. తల్లికి వందనం ఇస్తామని చెప్పారు, రాష్ట్రంలో 87 లక్షల మంది విద్యార్థులు ఉంటే 67 లక్షల మందికి ఇస్తామనిచెప్పడం, మిగిలిన 20 లక్షల మంది విద్యార్థులను మోసం చేసినట్లే అన్నారు. ఇక అన్నదాత సుఖీభవ కూడా మోసమే అన్నారు. రాష్ట్రంలో 93 లక్షల మంది రైతులు ఉన్నారని, అందులో 45 లక్షల మంది రైతులకు ఇస్తున్నారన్నారు. ఏడాది గడిచినా మహిళా శక్తి పథకం ఊసే లేదన్నారు గతంలో జగన్ రాష్ట్రాన్ని రూ. 10 లక్షల కోట్ల అప్పుల్లో ముంచేశారని, ఇప్పుడు బాబు సైతం అప్పులు పెంచుతున్నారని ఎద్దేవ చేశారు. ఇద్దరు కలసి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్ చేశారు అని విమర్శించారు. చంద్రబాబు సాధించిన ప్రగతి బిజెపికి ఊడిగం చేయడమే అన్నారు. ప్రత్యేక హోదా తీసుకొస్తామని చంద్రబాబు తిరుపతిలో హామీ ఇచ్చారని, ఆ హామీని కేంద్రప్రభుత్వాన్ని అడిగే ధైర్యం టిడిపికి, జనసేనకు లేదని పోయారు. కడప జిల్లాలో కడప స్టీల్ ప్లాంట్ హామీ ఇంతవరకు నెరవేరలేదు అన్నారు. రాష్ట్రంలో బిజెపిని వ్యతిరేకించే దమ్మున్న పార్టీ ఒక్క కాంగ్రెస్కు మాత్రమే ఉందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు ఎన్.డి. విజయ జ్యోతి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రత్యేక అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసి రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

15న తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఈనెల 15న ఉదయం 10 గంటలకు పాత రిమ్స్లోని బిసి భవన్లో తొగటవీర క్షత్రియ కుల పదవ తరగతి విద్యార్థులకు నగదు ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నట్లు తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నగర శాఖ అధ్యక్షులు కళ్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శి పల్లా నరసింహారావు తెలిపారు. గురువారం సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-2025 విద్యా సంవత్సరానికి 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన 59 మంది విద్యార్థులకు నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేస్తున్నామన్నారు. కడప నగర పరిధిలోని ప్రయివేట్ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు బహుకరిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని తొగటవీర క్షత్రియ కుల బాంధవులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రమణ్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శి పల్లా మురళీ కృష్ణయ్య, కోశాధికారి టేకూరి సుదర్శన్, ఉపాధ్యక్షులు సూరిబాబు, బొలిశెట్టి వెంకటస్వామి, పల్లా బాల చౌడన్న, దొండ్ల వెంకటరమణ పాల్గొన్నారు.

సమావేశ మందిరానికి తాళాలు తీయండి

- నోటీసులకు 16న సమాధానం ఇస్తా

- మేయర్ సురేష్ బాబు

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న మేయర్ సురేష్బాబు

నగరపాలక సంస్థ సర్వ సభ్య సమావేశ మందిరానికి అధికారులు వేసిన తాళాలు వెంటనే తీయాలని, లేనిపక్షంలో రెండు రోజుల్లో మీడియా సమక్షంలో తామే తెరుస్తామని మేయర్ సురేష్ బాబు చెప్పారు. గురువారం మేయర్ ఛాంబర్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22న సమావేశం నిర్వహించాల్సి ఉందని తెలిపారు. తాళాలు ఇవ్వమని కమిషనర్ను అడిగితే మేనేజర్ వద్ద ఉన్నాయని, మేనేజర్ను అడిగితే కమిషనర్ వద్ద ఉన్నాయని ఒక్కరి మీద ఒకరు చెబుతూ తప్పించుకుంటున్నారని పేర్కొన్నారు. అధికారులు ఒక పార్టీకి తొత్తులుగా వ్యవహరించడం సబబు కాదని చెప్పారు. స్థానిక సంస్థలపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని విమర్శించారు. ఏడాది కూటమి పాలనలో ప్రజలకు చేసింది శూన్యమని తెలిపారు. రాష్ట్రంలో దాదాపు అన్ని మున్సిపాలిటీ, కార్పొరేషన్లు టిడిపి అక్రమంగా కైవసం చేసుకుందని పేర్కొన్నారు. కడప కార్పొరేషన్లో టిడిపి కుయుక్తులు చెల్లక కుట్ర రాజకీయాలు చేస్తున్నారని చెప్పారు. కోట్లల్లో స్కాం జరిగిందంటూ దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కార్పొరేషన్ పనులలో తన ప్రమేయం లేకపోయినా కక్ష సాధింపులో భాగంగా వేటు వేయడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేషన్లో అధికారులు కూడా తన మాట వినడం లేదని చెప్పారు. నోటీసులకు ఈనెల 16న సమాధాన మిస్తానని చెప్పారు. తనకు తెలియకుండానే సర్వసభ్య సమావేశం తేదీని ప్రకటించారని చెప్పారు. సమావేశానికి సంబంధించి సర్వహక్కులు మేయర్కే ఉంటాయని తెలిపారు.

బాల కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - కడప : బాల కార్మికుల సమస్యలపై నిరంతరం దృష్టి సారించి, బాల కార్మికులను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. గురువారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్లో బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాల కార్మికుల సమస్యపై నిరంతర దృష్టి, బాల కార్మికులను నిర్మూలించడానికి అంతర్జాతీయ కార్మిక సంస్థ 2002వ సంవత్సరంలో మొదటిసారిగా ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం ఏర్పాటు చేసింది అని తెలిపారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యా మిత్ర కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-చెన్నూరు : మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి సర్వ శిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు కో- ఆర్డినేటర్ నిత్యానంద రాజు హాజరై మండల అధికారులతో కలిసి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి-2 సునీత, ఎంపిడిఒ కిరణ్ మోహన్ రావు, తహశీల్దార్ సరస్వతి, ఎంఇఒ వీరేంద్ర, ఎఎల్ఎస్ కో-ఆర్డినేటర్ విశ్వనాథరెడ్డి, ఐఇఒ కో-ఆర్డినేటర్ రమణమూర్తి, హెచ్ఎం రత్నాదేవి, సిఆర్పిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తేక్వాండోలో కడపకు ద్వితీయ ఛాంపియన్షిప్

ప్రజాశక్తి-కడప : అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈనెల 10, 11,12వ తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తేక్వాండో పోటీలలో కడప జిల్లాకు ద్వితీయ చాంపియన్ షిప్ లభించినట్లు తేక్వాండో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాయబ్ రసూల్ తెలిపారు. సబ్ జూనియర్, కేడెట్, జూనియర్, సీనియర్స్ విభాగంలో కడప జిల్లా నుండి 60 మంది క్రీడాకారులు పాల్గొని 12 బంగారు, 14 రజత, 12 కాంస్య పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలలో ఈనెల 23, 24, 25వ తేదీలలో పాల్గొనవలసి ఉంటుందని నాయబ్ రసూల్ తెలిపారు. **బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు..** తారక్, నదీష్, హుస్సేన్, కైసర్, చరణ్, ఫాతిమా, ఆఫ్రిన్, మాధవిలత, అలయంక, తస్లీమ్, అలకనంద మరియు త్రిలోక్షణా బంగారు పతకాలు సాధించారు. **రజత పతకాలు సాధించిన క్రీడాకారులు..**హుస్సేన్, తౌఫిక్, హవీష్ అబూబకర్, నయీమ్, సాజిద్, ఫర్మాన్, సయ్యద్, షణ్ముఖ, ఇస్మాయిల్, గురు జస్వంత్ , తశ్విక , ఖాన్సా. జోష్నా రజత పతకాలు సాధించారు. **కాంస్య పతకం సాధించిన క్రీడాకారులు..** అజీజ్, శ్రీనిజ్, ఫయుం, సాకీబ్, వెంకట శ్రీనివాస్, అక్బరుద్దీన్, గీతిక, అంజుమ్, పోషిత, సైఫ్ ఉన్నిసా కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా తైక్వాండో ప్రెసిడెంట్ బి. శివశంకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాయబ్ రసూల్ జిల్లా ట్రెజరర్ సలీం అభినందించారు.

తెలుగు సాహిత్యానికి జ్ఞానపీఠం 'సినారె'

ప్రజాశక్తి -కడప అర్బన్

కవిగా, పరిశోధకునిగా, నాటక కర్తగా, సినీ గీతాల రచయితగా తెలుగు సాహిత్యానికి జ్ఞానపీఠం సి.నారాయణ రెడ్డి అని రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి అన్నారు. కడప రెడ్డి సేవా సమితి వారి ఆధ్వర్యంలో గురువారం సేవా సమితి ప్రాంగణంలో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ఆచార్య సి. నారాయణరెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ నారాయణరెడ్డి మనిషిలోని మమతానురాగాలను, బాధలను, కన్నీళ్లను తన రచనల్లో మనోజ్ఞంగా తీర్చిదిద్దిన అక్షర శిల్పని, పద్యాన్ని, గద్యాన్ని చక్కగా నడిపించగల మేధావని, చందో రహస్యాలు తెలిసిన దిట్టని పేర్కొన్నారు. వచన కవిత్వాన్ని ప్రగతి మార్గంలో నాజూకుగా నడిపించిన నాయకుడని, అలాంటి మహోన్నత వ్యక్తిని స్మరించుకోవడం మనందరి కర్తవ్యంగా భావిస్తున్నానన్నారు. సమితి కోశాధికారి గుడ్ల ఆదినారాయణ రెడ్డి ప్రసంగిస్తూ నారాయణరెడ్డి చేసిన సాహిత్య కృషికి జ్ఞానపీఠ అవార్డు రావడం చాలా అభినందనీయమని చెప్పారు. రెడ్డి సేవా సమితి కార్యవర్గ సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ సినారె రాసిన విశ్వంభర కావ్యానికి జ్ఞానపీఠ పురస్కారం లభించిందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, రెడ్డి సేవా సమితి కార్యవర్గ సభ్యులు పద్మప్రియ చంద్రారెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, నరసింహ రెడ్డి, చెంచి రెడ్డి, కళాకారులు ఏవీఎస్ రాజు,జీవ కళ సత్యనారాయణ, రెడ్డి సేవా సమితి హాస్టల్ విద్యార్థినులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు అత్యవసర సేవలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : డిసిసి బ్యాంకు ఖాతాదారుల సౌకర్యార్థం డిసిసి బ్యాంకు ఐఎంపిఎస్ అత్యవసర సేవలు ఎంఇఎఫ్టి/ఆర్టిజిఎస్తో పాటు ఐఎమ్పిఎస్ సేవలు అందించనున్నామని డిసిసిబి చైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీని వల్ల బ్యాంకు ఖాతాదారుడు ఒక లక్ష వరకు చెల్లింపును మిగతా బ్యాంకులకు కానీ, మన బ్యాంకులకు కానీ నిమిషం లోపల చెల్లించుకునే వీలు కలుగుతుందని పేర్కొన్నారు. అవకాశాన్ని డిసిసి బ్యాంక్ ఖాతాదారులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిసిఒ వెంకటసుబ్బయ్య, ఆప్కాబ్ డైరెక్టర్ రాంబాబు నాయక్, నాబార్డ్ డిడిఎం విజయ్ విహారి, సిఇఒ రాజమణి, డిజిఎం ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ, ఎంఇఒలు

మెనూ ప్రకారం వడ్డించాలి

ప్రజాశక్తి - చాపాడు

మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం విద్యార్థులకు వడ్డించాలని ఎంపిడిఒ వీరకిషోర్ ఆదేశించారు. చాపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆయన గురువారం పాఠశాలల పునఃప్రారంభ సందర్భంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలుపరిచేందుకు చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా సన్న బియ్యం సరఫరా చేసిందన్నారు. వంట ఏజెన్సీ వారు పరిశుభ్రతనుకు ప్రాధాన్య తనివ్వాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే విద్యార్థులు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని అధికారులు స్వయంగా తిని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒలు రవిశంకర్, వంశీకృష్ణ, ప్రధానోపాధ్యాయులు వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




మారెడ్డి జోగిరెడ్డిని పరామర్శిస్తున్న టిడిపి నేతలు

మారెడ్డి జోగిరెడ్డికి టిడిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి - వేంపల్లె

తుంగభద్ర హై లెవెల్ కెనాల్ ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డిని టిడిపి నేతలు పరామర్శించారు. కొంత కాలంగా వెన్నునొప్పితో బాధపడుతున్న జోగిరెడ్డికి ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించడంతో గురువారం టిడిపి జిల్లా కార్యదర్శి ఎస్పీ జయరామిరెడ్డి ఆధ్వర్యంలో నేతలు సింహాద్రిపురం మండలంలోని కసనూరు గ్రామానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులపై ఎస్పి జయరామిరెడ్డి అడిగి తెలుసుకున్నారు. తొందరగా కోలుకోవాలని, పార్టీ చేపట్టే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. పంటలసాగుకు తుంగభద్ర కెనాల్ నుండి ఆయా కాలువలకు సాగు నీటిని అందించేందుకు కృషి చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఇప్పటికే చెరువులకు నీటిని సరఫరా చేసి నింపుతున్నట్లు జోగిరెడ్డి తెలిపారు. రైతులు పంటలు సాగు చేసుకొనే విధంగా సకాలంలో నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. జోగిరెడ్డిని పరామర్శించిన వారిలో పులివెందుల సర్పంచుల సంఘం అసోసియేషన్ తాలుకా అధ్యక్షుడు బొగ్గుల భాస్కర్‌రెడ్డి, వేముల మండల టిడిపి కన్వీనర్ బ్రహ్మయ్య, టిడిపి నాయకులు చాగలేరు మహేష్ ఉన్నారు.



మాట్లాడుతున్న విఎస్ ముక్తియార్

కమిటీ అభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్

స్థానిక మైదుకూరు రోడ్డులోని నజీరుల్లా సాహెబ్ గ్రౌండ్‌లో గురువారం అంజుమన్ అహలే ఇస్లాం నూతన కమిటీ అధ్యక్షుడిగా విఎస్ ముక్తియార్ ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పాల్గొన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు ముక్తియార్ మాట్లాడుతూ ఎలాంటి అవినీతి లేకుండా కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కమిటీ ఆస్తులను సంరక్షిస్తూ ముస్లింల పురోగతికి తోడ్పడాతానని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో, హజరత్ సయ్యద్, షాజహాన్ బాషా, మహమ్మద్ ఇక్బాల్, సురేష్ నాయుడు, జనాబ్ ఇనాయతుల్లా పాల్గొన్నారు.

నైతిక బాధ్యతతో రాజీనామా చేయాలి

- వైసిపి మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షులు వల్లంభాయి హృషికేశవరెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు నైతిక బాధ్యత వహిస్తూ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని వైసిపి జిల్లా మున్సిపల్ విభాగ అధ్యక్షులు వల్లంభాయి హృషికేశవ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం ఆయన 2ప్రజాశక్తి'తో ఫోన్‌లో మాట్లాడుతూ 1950 సంవత్సరంలో లాల్ బహుదూర్ శాస్త్రి రైల్వేశాఖ మంత్రిగా ఉన్నప్పుడు రైలు పట్టాలు తప్పిందని, అందుకు నైతిక బాధ్యత వహించి ఆ రోజు ఆయన రాజీనామా చేశారన్నారు. అహ్మదాబాద్‌లో విమానం కూలి 250 మందికిపైగా చనిపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి సమయంలో టిడిపి తరపున కేంద్ర మంత్రిగా ఉన్న రామ్మోహన్ నాయుడు నైతిక బాధ్యత వహించాలన్నారు. రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఇది దేశంలోనే గొప్ప దుర్ఘటన అన్నారు. ఈరోజు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏమి సాధించిందని విజయోత్సవ సభలు, సంబరాలు జరుపుకుంటోందని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ నైతిక విలువలు కలదని, ప్రజలకు బాధ్యతతో ఉంటుందని చెప్పడం కాదు రాజీనామా చేపించి తన చిత్తశుద్ధిని తెలియజేయాలన్నారు. విమాన ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబాలకు వైసిపి తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు.

చెట్టు కూలి హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని ఆంజనేయ కొట్టాలు గ్రామంలోని దర్గా వద్ద గురువారం క్షీణించిన పెద్ద చెట్టు కూలి మీద పడడంతో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీ నారాయణకు తీవ్ర గాయాల య్యాయి. ఆయన విధి నిర్వహణలో భాగంగా ద్విచక్ర వాహనంపై బద్వేల్‌కు వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. గాయపడిన హెడ్ కానిస్టేబుల్‌కు స్థానికులు సాయం చేశారు. కూలిపోయిన చెట్టు రోడ్డుకు అడ్డంగా పడడంతో గ్రామస్తులందరూ తొలగించే చర్యలు చేప ట్టారు. క్షీణించిన వక్షాలను వెంటనే గుర్తించి తొలగించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



గాయపడిన లక్ష్మీ నారాయణ

పాఠశాల విలీనంపై తల్లిదండ్రుల నిరసన

- నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్న ఉపాధ్యాయులు.. ససేమిరా అంటున్న తల్లిదండ్రులు



తల్లిదండ్రులతో చర్చిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

ప్రజాశక్తి - చాపాడు

తమ పిల్లలను కిలోమీటర్‌పైగా దూరం ఉన్న మొర్రాయపల్లె పాఠశాలకు ఎట్టి పరిస్థితుల్లో పంపబోమని సిద్ధారెడ్డిపల్లె దళితవాడ ప్రజలు తేల్చి చెప్పారు. వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వం గురువారం పాఠశాలలను తెరచింది. సిద్ధారెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులకు చెందిన 19 మంది విద్యార్థులను కిలోమీటర్ కంటే ఎక్కువ దూరం ఉన్న మొర్రాయపల్లె మోడల్ పాఠశాలలో విలీనం చేశారు. గురువారం విద్యార్థులను పాఠశాలకు తీసుకువెళ్లేందుకు ఉపాధ్యాయులు రాగా తల్లిదండ్రులు తమ పిల్లలను పంపబోమని వారితో తేల్చి చెప్పారు. గతంలో కూడా విద్యార్థులను పంపబోమని చెప్పినప్పటికీ ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు నిర్ణయాలు తీసుకున్నారని, తమ పిల్లలను ఇంటి వద్దనే ఉంచుకుంటామని పాఠశాలకు మాత్రం పంపేదిలేదని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు చెప్పినప్పటికీ వారు ససేమిరా అన్నారు. కిలోమీటర్ కంటే ఎక్కువ దూరం ఉంటే ప్రభుత్వం ఆటో ఛార్జీల కోసం రూ.600 చెల్లించే నిబంధన ఉన్నప్పటికీ.. కేవలం 700 మీటర్లు మాత్రమే ఉన్నట్లు చూపి ఆ అవకాశం కూడా లేకుండా చేశారని ప్రజలు వాపోయారు. సిద్ధారెడ్డిపల్లి గ్రామం నుండి మొర్రాయిపల్లెకు వెళ్లాలంటే నాగయ్యపల్లె మీదుగా 1.3 కిలోమీటరు దూరం ఉంది. ఆన్‌లైన్ జియోట్యాగ్ ద్వారా కేవలం 700 మీటర్లు మాత్రమే ఉన్నట్లు అధికారులు నిర్ణయించి విద్యా ర్థుల కు అన్యాయం చేశారు. గ్రామంలో పాఠశాల కొనసాగించితే తప్ప, తమ పిల్లలను పాఠశాలకు పంపేది లేదని నిర్ణయానికి వచ్చారు. ఇప్పటికైనా అధి కారులు స్పందించి విలీనంపై పునఃపరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చర్చించకుండానే పాఠశాల విలీనం

ఉపాధ్యాయులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా 3,4,5 తరగతుల విద్యార్థులను పక్క గ్రామంలోని పాఠశాలలో కలిపేశారు. తమ పిల్లలను గ్రామంలోని పాఠశాలకు మాత్రమే పంపిస్తాం. ప్రభుత్వం విలీన ప్రక్రియను పునఃపరిశీలన చేసి గ్రామంలో పాఠశాలను కొనసాగించాలి. లేనిపక్షంలో పిల్లలను చదువు మాన్పించి ఇంటి వద్దనే ఉంచుకుంటాం.

- శివమ్మ, విద్యార్థి తల్లి, సిద్ధారెడ్డిపల్లి

పాఠశాలను గ్రామంలోనే కొనసాగించాలి

గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోనే 3,4,5 తరగతులను గ్రామ సమీపాన ఉన్న మొర్రాయి పల్లె పాఠశాలలో విలీనం చేపట్టారు. పిల్లలను అక్కడికి పంపడం సమస్యగా ఉంటుంది. ఆర్థిక స్తోమత లేని పేద ప్రజలకు ప్రభుత్వం విద్యను దూరం చేసే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోనే పాఠశాలను కొనసాగించాలి.

- కవిత, విద్యార్థి తల్లి, సిద్ధారెడ్డిపల్లె

రైతులపై చిత్తశుద్ధిలేని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

కూటమి ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి లేదని వైసిపి ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పొగాకు రైతుల్లో ధైర్యం నింపేందుకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ పొదిలికి వెళితే కూటమి ప్రభుత్వం రాళ్లు, చెప్పులతో దాడి చేయించడం హేయమైన చర్య అన్నారు. డిఎస్‌పి తలపై చెప్పులు పడ్డాయన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్య తీవ్రమైందన్నారు. పండించిన పొగాకును కొనుగోలు చేయకుండా ప్రభుత్వం ఉండడం బాధాకరమన్నారు. రైతులపై, వ్యవసాయంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిసోతందని విమర్శించారు. జగన్ పర్యటన, వెన్నుపోటు దినోత్సవంలో ప్రజలు వేలాదిగా తరలివచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం సొంత పత్రికల్లోనే కూటమి ఎమ్మెల్యేలలో అవినీతి పెరిగిందని పెద్ద అక్షరాలలో రాయడం జరిగిందన్నారు. ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని తెలి పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా జగన్ రైతులకు అండగా ఉండి అన్ని రకాలా ఆదుకుందన్నారు. కూటమి ప్రభుత్వం రైతు భరోసా, సచివాలయ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందన్నారు. మంచి పరిపాలన కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేశు, సట్టకారు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సంబరాల్లో టిడిపి శ్రేణులు



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ, కూటమి నేతలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కూటమి ప్రభుత్వానికి ప్రజలపై చిత్తశుద్ధి ఉందని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గం శాసనసభ్యులు చదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి, జమ్మలమడుగు నియోజవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బ రామిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌డిఎ ప్రభుత్వం విజయవంతంగా సంవత్సరం పూర్తయిందన్నారు. అయ్యిందన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివద్ధి చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధిపై అవగాహన ఉన్న ఎమ్మెల్యే ఉంటే ఇలానే అభివృద్ధి చెందుతుందన్నారు. సూపర్‌సిక్స్, పథకాలలో భాగంగా తల్లికి వందనం పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జమ్మలమడుగు మండలం తెలుగుదేశం పార్టీ బాధ్యులు నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ముద్దనూరు : కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిందని టిడిపి మండల అధ్యక్షులు చింతా శివరామిరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో శివరామిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వల్లూరు : రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అభివృద్ధి కృషి చేస్తోందని టిడిపి మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రెడ్డి పేర్కొ న్నారు. గురు వారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాల యంలో కేక్ కట్ చేయడం అనంతరం ఆయన మాట్లా డుతూ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచిందని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రం అధోగతి పాలనలో ఉందని, 30 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిన ఘనత జగన్‌మోహన్‌డికి దక్కుతుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉచిత గ్యాస్, పింఛన్లు, తల్లికి వందనం వంటి పథకాలు అమలు చేసింద న్నారు. కార్యక్ర మంలో మాజీ ఎంపిటిసి రామ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ రాఘవరెడ్డి, సుధాకర్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి,శంకర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, సుబ్బరాయుడు, చిట్టిబాబు, సర్దార్ పాల్గొన్నారు.



ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న లక్ష్మిరెడ్డి

కడప అర్బన్ : తెలుగుదేశం పార్టీ ఎన్ఆర్ఐ కువైట్ ఉపాధ్యక్షులు రహమతుల్లా ఆధ్వర్యంలో కడప ఎన్ఆర్ఐ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సిఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కూటమి ప్రభుత్వ పాలన సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా తల్లికి వందనం పథకం అమలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్, టిఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షులు అనిల్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు షేక్ ఇర్ఫాన్,సాద్ పాల్గొన్నారు.

చాపాడు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల పార్టీ కార్యాలయంలో గురువారం కేక్ కట్ చేసి నాయకులు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ ప్రాజెక్టు వైస్ చైర్మన్ డి.గురివిరెడ్డి, టిడిపి నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నారపురెడ్డి, రామ్మోహన్, నాగేశ్వర్‌రెడ్డి, వీరారెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: కూటమి ప్రభుత్వ ఏర్పడిన తర్వాత సంవత్సరకాలం పూర్తయిన సందర్భంగా ఒంటిమిట్ట మెయిన్ బజార్ వీధిలో గురువారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి వచ్చిన నాయకులు కార్యకర్తలను ఉద్దేశించి రాష్ట్ర మహిళా సభ్యులు ఓబీనేని సుబ్బమ్మ కొమరా వెంకట నరసయ్య తెలుగుదేశం సీనియర్ నాయకులు మామిళ్ళ ఈశ్వరయ్య మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం పింఛన్లు, మహిళకు మూడు సిలిండర్లు, తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తుందని చెప్పారు. 87 లక్షల మంది తల్లులకు వారి పిల్లలకు లబ్ది కూర్చే విధంగా సుమారు రూ. 8 743 కోట్లను తల్లుల ఖాతాలో జమ చేశారన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు సౌకర్యాన్ని కూడా కల్పిస్తారన్నారు. ఈనెల 21 న అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.7,000 తొలి విడత సహాయ మొత్తంగా ముఖ్యమంత్రి రైతుల ఖాతాల్లో జమ చేయ నున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు పామూరు సుబ్రమణ్యం, రాజంపేట పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి మోదుగుల నర్సింహులు, రాచగూడపల్లి ఎంపిటిసి ప్రతినిధి నల్గొండ సుబ్బారెడ్డి, అసెంబ్లీ తెలుగు యువత అధ్యక్షులు మునగపాటి వెంకటరమణ, బాలమున్నయ్య గంగ పేరు కృష్ణారెడ్డి మంటపం పల్లి ఎంపిటిసి బాషా, మాజీ సర్పంచ్ నారాయణ మలకాటి పల్లె శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి కృష్ణారెడ్డి, మైనార్టీ నాయకులు ఖాదర్ బాషా అజ్మతుల్లా సత్తార్ బిసి నాయకులు వెంకటేష్ మధు మఠం రాజు మాధవరం సోమ నారాయణ, అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఒంటిమిట్టలో.. సంబరాలు చేసుకుంటున్న నాయకులు

అక్రమ కట్టడాలు తొలగింపు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రోడ్లపై అక్రమంగా ఉన్న కట్టడాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. గురువారం స్థానిక రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద నుండి గరండాల వంతెన వరకు రోడ్డు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను జెసిబిలతో తొలగించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ తేజ మాట్లాడుతూ ఎవరైనా దుకాణాల ముందర రోడ్డుపైకి సాగి అక్రమంగా నిర్మాణాలు చేపడితే తొలగించడంతోపాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా కట్టడాలు కట్టిన వారు స్వచ్ఛం దంగా దుకాణాల ముందు తొలగించుకోవాలని ఆయన కోరారు.





విజేతలతో క్రీడా పోటీల నిర్వాహకులు

జిల్లా స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీలు విజయవంతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో మహిళలు, పురుషులకు జిల్లా స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 100 మీ, 200 మీ, 400 మీ, 800 మీ, లాంగ్ జంప్ ఈవెంట్స్‌లో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు అందించారు. రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక వారిలో ఎం. లోకేశ్వరరావు, జి.సింహాచలం, పి.మంజునాథ, బి.ఏసు వరప్రసాద్, కె.మహేష్, బి.మల్లికార్జున, ఆర్.ముని నరేంద్ర, మహేశ్వరి, ఎస్. స్నేహలత, నాగన్న, వీణ ఉన్నారన్నారు. వీరు ఈనెల 14,15 తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అమరావతిలో జరగబోయే ఏపీ స్టేట్ సీనియర్ ఛాంపియన్షిప్‌లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ క్రీడ నిర్వహణలో వ్యాయామ సంచాలకులు నాగేశ్వరరావు, ఖాదర్‌రెడ్డి, కుమార్, దిలీప్, కోచ్ అనిల్ సహకరించారని తెలిపారు. వీరికి నిర్వాహకులు వై.అమర్‌బాషా ధన్యవాదాలు తెలిపారు.

రాజారెడ్డి ఆశయాలకు తూట్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పూజా స్కూల్ వ్యవస్థాపకుడు రాజారెడ్డి ఆశయాలకు తూట్లు పొడుస్తూ పూజ స్కూల్ పేరుతో మాఫియా కార్యక్రమాలు నడు పుతున్న ప్రస్తుత యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజా, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద గురు వారం ఆందోళన చేశారు. అనంతరం తహశీల్దార్ గంగయ్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి, రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (బ్రహ్మయ్య మాదిగ వర్గం) జిల్లా అధ్యక్షుడు రంగనాయకులు మాట్లాడుతూ కలెక్టర్ వెంటనే చొరవ చూపాలన్నారు. ఎస్‌పి స్పందించి పూజ స్కూల్లో ఉన్న క్రిమినల్స్‌ను అక్కడి నుంచి పంపాలని కోరారు. ఆందోళనలో విద్యార్థి నాయకులు విల్సన్, రవి, శ్రీకాంత్, ప్రవీణ్, ప్రజాసంఘాల కార్యకర్తలు మస్తాన్, ఏసుదాసు, మస్తాన్, ఎమ్మార్పీఎస్, దళిత నాయకురాలు అక్కయ్య, లక్ష్మమ్మ పాల్గొన్నారు.



వినతిపత్రాన్నిస్తున్న సంఘాల నాయకులు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని నాగార్చన కోరారు. గురువారం మండల పరిధిలోని చెన్నముక్కపల్లె, చెముల్లపల్లి గ్రామాలలో వికషిత కృషి సంకల్ప అభయస్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్, రైతు నమోదు, కిసాన్ డ్రోన్ వంటి పథకాలు, సాంకేతిక గురించి రైతులకు వివరించారు. భారత నూనె గింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త రత్నకుమార్ యాజమాన్య పద్ధతులు, అంతర పంటల సాగు గురించి వివరించారు. కెవికె సమన్వయకర్త వీరయ్య రైతులకు తగు సూచనలు చేశారు.

కడప స్టీల్ ప్లాంట్‌పై మళ్లీ మాట తప్పిన బాబు

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి


ప్రజాశక్తి - వేంపల్లె

కడప జిల్లాలో చేపట్టే స్టీల్ ప్లాంట్ నిర్మాణంపై కూటమి సిఎం చంద్రబాబు మళ్లీ మాట తప్పారని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విభజన చట్టంలో 13వ షెడ్యూల్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కడప జిల్లాలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌ను నిర్మించాల్సి ఉందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరిగి ఉండేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల కడపలో జరిగిన మహానాడులో కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణంపై వాగ్దానం చేశారన్నారు. 2025 జూన్ 12లోగా జిందాల్ కంపెనీ పనులు ప్రారంభిస్తుందని మహానాడులో సిఎం చంద్రబాబు చెప్పారన్నారు.

గ్రామ పంచాయతీ ఇఒగా మాధవరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె గ్రామపంచాయతీ ఇఒగా కె.మాధవరెడ్డిని నియమించారు. ఆమేరకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. మైలవరం మండలం వేపరాల గ్రేడ్-2 గ్రామపంచాయతీ అధికారిగా పనిచేస్తున్న మాధవరెడ్డి వేంపల్లె గ్రేడ్-1 గ్రామపంచాయతీ అధికారిగా ఉద్యోగోన్నతి పొందారు. మార్చి 6న వేంపల్లె గ్రామపంచాయతీ ఇఒగా పనిచేస్తున్న నిమ్మకాయల వెంకటసుబ్బారెడ్డి అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయ్యారు. ఆ తర్వాత రెండు నెలలుగా ఎవరూ రాకపోవడంతో వేంపల్లె గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తాయి.



'తల్లికివందనం'పై స్పష్టతనివ్వాలి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : తల్లికివందనం పథకంపై విద్యార్థుల తల్లిదండ్రులకు స్పష్టతనివ్వాలని, ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రతి విద్యార్థికి పథకాన్ని అమలు చేయాలని విద్యార్థి యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. పట్టణంలోని విద్యార్థి యువజన సంఘాల కార్యాలయంలో ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేష్ కత్తి, తెలుగు రాష్ట్ర విద్యార్థి సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయ రాజు, ఎన్‌డిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ గురు వారం విలేకరులతో మాట్లాడారు.